# సైకతత శిల్పం

గన్నవరపు నరసింహమూర్తి

సంధ్యాసమయం! సూర్యుడి సంజెకిరణాలు సముద్రంపై ఏటవాలుగా పడుతున్నాయి. పడమరదిక్కున అరుణ బింబం ఆకాశం నుదుట సింధూరంలా ఉంది. ఆ సమయంలో నేను బీచ్‌లోకి వెళ్ళాను.

నేను పూరీ వచ్చి అప్పుడే రెండు రోజులైంది. మొదటిరోజు జగన్నాథుడి ఆలయ దర్శనం చేసుకున్నాను. ఈరోజు మళ్ళీ ఆ దేవుణ్ణి దర్శనం చేసుకొని బీచ్‌కి వచ్చాను. పూరీ బీచ్ చాలా అందంగా ఉంటుందనీ చాలామంది చెబుతుంటే వినడమేగానీ ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. నిజంగా ఈ బీచ్‌లో ఓ ప్రత్యేకత ఉంది. మొత్తం మూడు కిలోమీటర్ల పొడవునా వెడల్పాటి ఇసుక తిన్నెలు... అదే ఈ బీచ్ ప్రత్యేకత.

అలా జనాల్ని దాటుకుంటూ నిర్మానుష్యంగా ఉన్నచోట కూర్చున్నాను. నేను విశాఖపట్నం విడిచి అప్పుడే పదిహేను రోజులవుతోంది. ఇంకా నాకు ఇంటికి వెళ్ళబుద్ధికావడం లేదు. ఆ సమయంలో నాకు లయ గుర్తుకు వచ్చింది. ఆమెతో నడిపిన ప్రేమాయణం గుర్తుకు వచ్చింది. ఆమె నన్ను మోసం చెయ్యడం, ఇంకొకర్ని పెళ్ళి చేసుకోవడం గుర్తుకొచ్చింది.

నేను ఇంజనీరింగ్ చదువుతుండగా లయ పరిచయం అయింది. అదీ ఒక చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నపుడు. అలా అయిన పరిచయం ఇంజనీరింగ్ పూర్తయ్యేసరికి ప్రేమగా పరిణామం చెందింది. కానీ ఎందుకో ఆమె మనసు మార్చుకుని వేరొక వ్యక్తిని పెళ్ళాడి అమెరికా వెళ్ళిపోయింది.

ఆ విధంగా నా మనసుని ఆమె తీవ్రంగా గాయపరిచింది; ఎందుకలా చేసిందో అడుగుదామని ఎంత ప్రయత్నించినా ఆమె దర్శనం కలగలేదు. బహుశా నాకు సమాధానం చెప్పలేక ముఖం చాటేసిందనుకుంటాను.

ఆమె పెళ్ళి చేసుకొని హాయిగా భర్తతో అమెరికా వెళ్ళిపోయింది గానీ నా పరిస్థితే అగమ్యగోచరంగా తయారైంది. రెండు నెలలవరకు నేను మామూలు మనిషిని కాలేకపోయాను. ఆమెచేసిన గాయం మానాలంటే కొంతమార్పు కావాలనిపించింది. అందుకే దేశాటన మొదలుపెట్టాను. నా సంగతి గ్రహించి మా అమ్మా నాన్నలు కూడా దానికి సరేనన్నారు.

మొదటగా కలకత్తా వెళ్ళాను. అక్కడ చాలా ప్రదేశాలు చూశాను. బేలూరు మఠంలో ప్రశాంతతని చూశాను. కాళీమాత గుడిలో రౌద్రాన్ని ఆస్వాదించాను. ఆ తరువాత శాంతినికేతన్‌కి వెళ్ళాను. అక్కడ నేనొక కొత్త ప్రపంచాన్ని చూశాను. అక్కడ కళాకారులు ప్రకృతిలో మమేకమైపోయి కళలను ఔపాసనపట్టడం నాకు ఆనందాన్ని కలిగించింది.

ఆ తరువాత పూరీకి వచ్చాను. పూరీ ఆలయంలో జగన్నాథుణ్ణి చూస్తుంటే భక్తిభావం పొంగిపొర్లింది నాలో. అలా వచ్చిన రెండురోజులకే నాలో మార్పు కనబడసాగింది. ఆలోచనల్లోంచి తేరుకొని ఒంటరిగా తీరం వెంబడి నడవసాగేను. అలా ఎంతదూరం నడిచానో తెలియదు.

ఇంక వెనుతిరిగిపోదామనుకునేంతలో అప్పుడు చూశాను ఆమెని. సముద్రపు అలలకు దగ్గరగా ఇసుక తిన్నెమీద శిల్పాన్ని చెక్కుతోంది. సంజెకిరణాలు ఆమె ధవళ వస్త్రాలపై పడి పరావర్తనం చెందుతున్నాయి. హోరుగాలికి పైట ఎగురుతున్నా, ముంగురులు ముఖంపై పడి చిరాకు కలిగిస్తున్నా ఏకాగ్రతని ఏమాత్రం కోల్పోకుండా ఆ శిల్పాన్ని మలుస్తోంది. హోరుగాలి పెద్దదవడంతో ఆమె ముంగురుల్ని పైకి జరుపుతుండగా అప్పుడు చూశాను ఆమె ముఖాన్ని. సింధూరవర్ణపు వెలుగు కిరణం ఆమె ముఖంమీద పడటంతో ముద్దమందారంలా కనిపించింది. అలా ఆమెని చూస్తూ చాలాసేపు గడిపాను.

ఇంతలో చీకటి పడుతుండటంతో అప్పటి దాకా

చెక్కిన ఆ సైకత శిల్పాన్ని వదలి వెనుతిరుగుతూ నన్ను చూసింది. నేను ఆమెనే తీక్షణంగా చూస్తుండటంతో ఆమె ఉలిక్కిపడి పైటసర్దుకుంటూ గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోసాగింది.

ఎందుకో ఆమెతో ఆ క్షణాన మాట్లాడాలనిపించింది. అందుకే బిగ్గరగా 'మేడమ్' అన్నాను. ఆ పిలుపుకి ఆమె వెనుతిరిగి నావైపు కోపంగా చూసింది. ఆమె దగ్గరగా వెళ్తూ ''మేడమ్! యువర్ వర్క్ ఈజ్ ఎక్సలెంట్'' అన్నాను.

''థ్యాంక్స్! కానీ మీరు చేసిన పని నాకు నచ్చలేదు. అలా దొంగతనంగా చూడొచ్చా?!'' ఒక్కసారిగా అలా రాష్ట్రంకాని రాష్ట్రంలో ఒక అమ్మాయి తెలుగులో మాట్లాడే సరికి నాకు చెప్పలేనంత ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగింది.

''మీరు తెలుగువారా?!'' ఆశ్చర్యంతో నానోట మాటలురావటంలేదు. ''అయినా నేను తెలుగువాణ్ణని ఎలా పోల్చుకున్నారు''

''తెలుగు దాన్నైన నేను తెలుగువాళ్ళని పోల్చుకోవ డం ఓ పెద్ద విషయమా?'' ఆమె కళ్ళను చక్రాల్లా తిప్పుతూ చెప్పడం చూడటానికి బాగుంది. అప్పుడు ఆమెను పరిశీలగా చూశాను. చాలా ఆకర్షణీయంగా ఉంది. ముఖ్యంగా ఆమె కళ్ళు... దయని వర్షిస్తున్నట్లు న్నాయి.

''మేడం! మీరు కూడా నాలాగే టూరిస్టులా?''

''నాపేరు హారిక; నీహారిక. నేను టూరిస్టునికాను. ఇక్కడే నేను ఆరు నెలల నుంచి ఉంటున్నాను''

## గతకాలపు స్మృతులు

ఈ యుగాది ఏనాటిదో
ఈనాడే కొత్త 'ఉగాది'!
విరోధిని ద్వేషించి
'వికృతి'గా విచ్చేసింది!
రుధిర ధారలు నడిచిన
గత వత్సరాది
హత్యలు ఆక్సిడెంట్లతో
రక్తాన్ని కురిపించింది!
అధిక వృష్టి వరదలతో
అసువులను బలికొంది!
కొంపలను కూల్చింది
పంటలను ముంచింది!
ఎక్కడుంది స్త్రీ రక్షణ?
మానధనం దోచింది
కీచకుల నణచకలేక
నిట్టూర్పులను విడిచింది!
చుక్కలు తాకిన ధరలు
సామాన్యుని అణిచింది!
వర్తకుల స్వార్థబుద్ధిని
నల్లబజారు చేర్చింది!
ఆ హత్యలు దోపిడీలు
ఆత్మగతమున మరిచేదెలా!
కుటిలనీతి, కార్పణ్యాలను
మనోగతాన మరిచేదెలా!
కొత్త వత్సర 'వికృత' రూప
వీక్షణాలెటువంటివో!
బీభత్సమును ప్రదర్శించి
మనలనేమి చేస్తుందో!
అందుకేనేమో-
ఉదయభాను అరుణబింబం
క్రోదాగ్నులు కురిసింది!
కర్కశంగా కోకిలలు
'కాకిగోల' చేస్తున్నవి!

ఓరుగంటి మురళీధర్

''ఆరునెలల నుంచా?! ఇక్కడేం చేస్తున్నారు మీరు?''

''పురాతన ఆలయాలమీద ఒక పరిశోధన గ్రంథం వ్రాస్తున్నాను. అందుకే వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ పూరీజగన్నాథుడి ఆలయ విశేషాలను సేకరిస్తున్నాను. ఉదయమంతా ఆలయంలో విషయసేకరణ, సాయంత్రం ఈ బీచ్‌లో అందాల వీక్షణ, అప్పుడప్పుడు ఈ సైకత శిల్పాలను చెక్కడం''

## పేద వ్యాసుడు

నా మిత్రుడు కాపిటలిస్టు
అతడికి తరగని నిధి పేదలకు ఉపాధి
అతడి కొడుకు స్టూడెంటు
పేదలపై వ్యాసమతడి టేస్టూ టాలెంటు
పేదవాడి నౌకర్లూ కారు తోలు చాఫర్లూ
పేదవాడి ట్రేడింగుకి స్టాక్ మార్కెట్ బ్రోకర్లూ
పేదవాడి తోటలకి నీళ్ళట్టిన మాలీలూ
పేదవాడి మేడలకి రాళ్ళెత్తిన కూలీలూ
వాళ్ళంతా పేదలు నిరుపేదలంటు
పేదవ్యాసమొకటి వ్రాసి చూసుకుని మురిసాడు

నా మిత్రుడు కమ్యూనిస్టు
అతడికి కరిగిన మది పేదలకు పెన్నిధి
అతడి బ్రతుకు మార్క్సిజం
పేదలె వ్యాసంగమతడి బోధలె కమ్యూనిజం
అతడి పనికి నౌకర్లూ కారు తోలు చాఫర్లూ
అతడి షేర్ల ట్రేడింగుకి స్టాక్ మార్కెట్ బ్రోకర్లూ
అతడు కొన్న తోటలకి నీళ్ళట్టిన మాలీలూ
అతడికున్న మేడలకి రాళ్ళెత్తిన కూలీలూ
వాళ్ళంతా మార్క్సిస్టులు వాళ్ళే కమ్యూనిస్టులు
వాళ్ళే వైతాళికులని ఘోషపెట్టి మురిసాడు

అతడు నిరసించే సంప్రదాయం వేదవ్యాసుడిది
అనుసరించే సంప్రదాయం పేదవ్యాసుడిది

వసుంధర

''మీరు ఈ ఇసుకతో చాలా అందంగా శిల్పాన్ని చెక్కుతున్నారు. మీకిదివరకే ఈ కళలో పరిచయముందా హారిక గారూ''

''అదేంలేదు; నిజానికి ఇక్కడికొచ్చిన తరువాతే ఈ సైకత శిల్పాల గురించి తెలిసింది. దేశంలో ఏ బీచ్‌లోను కనిపించని సైకతశిల్పాలు ఇక్కడ చాలామంది తయారు చేస్తుంటారు''

అప్పటికే తీరం పొడవునా చీకటి వ్యాపిస్తుండటంతో ఇద్దరం పట్నంవైపు తిరుగుముఖం పట్టాము. నడుస్తూ ఆమె నా వివరాలు అడగటం మొదలుపెట్టింది.

''నా పేరు కృష్ణ హారికగారూ! మాది విశాఖపట్నం. ఇంజనీరింగ్ చదివిన తరువాత కొన్నాళ్ళబాటు అందమైన ప్రదేశాలు చూడాలని బయలుదేరాను. నిజంగా ఇక్కడికొచ్చేదాకా ఈ ప్రదేశం, ఈ సముద్రం, ఇక్కడి బీచ్ ఇంత అందంగా ఉంటాయనీ నాకు తెలీదు. కాకపోతే ఇక్కడి భోజనం, ఒరియా భాష ఈ రెండే ఇబ్బందిపెడుతున్నాయ్''

''ఇంతకీ మీరెక్కడ దిగారు? ఎన్నిరోజులిక్కడ ఉంటారు?''

''నిజానికి నేను ఓ రెండు రోజులిక్కడ ఉందామని వచ్చాను నీహారికగారు; కానీ మరి కొన్నిరోజులుండాని పిస్తోంది. నేను ఆలయం దగ్గర ఒక లాడ్జీలో దిగాను'' ఇద్దరం మాట్లాడుతుండగానే ఆలయం వచ్చేసింది. ఆమె నాకు గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

మర్నాడు బీచ్‌లో అదే ప్రదేశంలో నీహారిక కనిపించింది. నిన్న అసంపూర్తిగా వదలివేసిన ఆ సైకత శిల్పానికి మరిన్ని మెరుగులు దిద్దుతోంది. అవి రాధామాధవుల శిల్పాలు... వాటిలో జీవకళ ఉట్టిపడుతోంది. నన్ను చూసి పలకరింపుగా నవ్వి ''ఎంతసేపైంది మీరొచ్చి?'' అంది.

''ఇప్పుడే; నిజంగా మీ శిల్పాలు అద్భుతం నీహారిక గారూ! ఎవరో ప్రఖ్యాత శిల్పి చెక్కినట్లున్నాయి''

ఆ మాటలు విన్న నీహారిక ''ఎంత అందంగా ఉంటే ఏంలాభం చెప్పండి; ఇది అశాశ్వతం. మనం కష్టపడిన న్నాళ్ళు ఉండదు'' నిరాశగా అంది.

ఇద్దరం అక్కడికి దూరంగా కూర్చొని మాట్లాడుకోసాగాం. అప్పటికే ఆమెతో పరిచయం పెరగడంతో నా గురించి చెప్పడం మొదలుపెట్టాను.

''నీహారిక గారూ! నిన్న నా గురించి కొంతవరకే చెప్పాను. నాకు చిన్నప్పట్నుంచి చిత్రలేఖనం అంటే ప్రాణం! ఇంజనీరింగ్ పూర్తయ్యేదాకా దాన్ని కొనసాగిం

## ఒకటే భావం

**తే**నె అనండి, విరిసినమల్లే అనండి
రాయలభాషే కదండి
కోయిలపాట అనండి, వీణస్వరాలు అనండి
కమ్మనైన మాట ఇదే కదండి
సంక్రాంతి అనండి, యుగాది అనండి
తెలుగింటి సంబరాలే కదండి
సప్తగిరి అనండి, తిరుమల అనండి
శ్రీవెంకటేశ్వరుని మకుటమే కదండి
కనకదుర్గమ్మ అనండి తెలుగుమాత అనండి
ఆంధ్రబిడ్డలను పాలించే తల్లే కదండి
తెలంగాణ అనండి, నైజాం అనండి
యాసలున్న తెలుగే కదండి
గోదావరి అనండి, క్రిష్ణవేణి అనండి
పరవళ్ళు తొక్కే జీవనదులే కదండి
పాలకొండ అనండి, అరకువ్యాలి అనండి
భూతలస్వర్గమిదే కదండి
రాసి చూడండి, పోల్చి చూడండి
ఆణిముత్యాలే కదండి
కోనసీమ అనండి, రాయలసీమ అనండి
ఆంధ్రదేశమే కదండి

సోమ సురేశ్

చాను. ఈలోగా ఒక అమ్మాయి ప్రేమలో పడ్డాను. కానీ ఆమె నన్ను మోసం చేసి ఇంకొకర్ని పెళ్ళాడి అమెరికా వెళ్ళిపోయింది. దాంతో నేను చాలా షాక్‌కి గురయ్యాను. నాలో నిస్పృహ చోటు చేసుకుంది. ఈ బ్రతుకుపట్ల విముఖత కలిగింది. అందుకే కొన్నాళ్ళు కొత్త కొత్త ప్రదేశాలు చూస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇలా తిరుగుతున్నాను'' నేను చెబుతుంటే మౌనంగా వింటోంది ఆమె.

అలా చాలాసేపటి వరకు మాట్లాడుకొని ఊరివైపు బయలుదేరాం. నన్ను హోటల్ దగ్గర విడిచిపెడుతూ ''రేపు ప్రభాత సమయంలో ఆలయం దగ్గరకు రండి; జగన్నాథుణ్ణి ప్రభాత దర్శనం చేసుకుందురుగాని. ఇక్కడ ఆ సమయంలో ఇచ్చే హారతిని కనులారా చూడవలసిందే. తప్పకరండి'' అని చెప్పి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

ప్రభాతవేళ! ప్రాక్ దిశ సిందూరవర్ణంతో అందమైన కాన్వాస్‌ని గుర్తుకు తెస్తోంది. నేను వడివడగా ఆలయం చేరుకున్నాను. ఆలయంలోంచి ఒరియాలో 'మీరాభజన్' మంద్రమైన స్వరంతో వినిపిస్తోంది. ఆ ప్రత్యూషపు వేల లేత వెలుగు కిరణాలు శ్వేతవర్ణపు ఆలయంపై పడి పరావర్తనం చెందుతూ, ఆ ఆలయానికి ఒక వింత శోభని చేకూరుస్తున్నాయి. ఆ ఆలయశిఖరంమీద వేల వేల తెల్లపావురాలు ఎగురుతూ శుభోదయానికి స్వాగతం పలుకుతున్నాయి. నేను ఆలయంలోపలికి ప్రవేశించేసరికి నీహారిక నాకోసం ఎదురుచూస్తోంది.

ఆ ఉషోదయాన తెల్లని బట్టలతో ఆమె ఒక దేవదూతలా కనిపించసాగింది. ఇద్దరం కలసి ఆ జగన్నాథుణ్ణి ప్రభాతదర్శనం చేసుకున్నాం. మన దక్షిణాది ఆలయాల్లోలాగ అక్కడ దైవదర్శనానికి ఎక్కువ సమయం పట్టదు. ఆ ఆలయ ప్రత్యేకత ఏమిటంటే అక్కడ జగన్నాథ, బలభద్ర, సుభద్రలవి రాతి విగ్రహాలు కావు. అవి ఒకవిధమైన కర్రతో చెక్కబడి ఉంటాయి.

దర్శనంకాగానే ప్రసాదం తింటూ ఆలయ ప్రాంగణంలో కూర్చొని వచ్చేపోయే భక్తుల్ని చూడసాగేం. అప్పుడు నిన్నరాత్రి నీహారిక అన్నమాటలు గుర్తొచ్చి ఆమెని అడిగాను ''నీహారిక గారూ! ఈ ఆలయ విశేషాలు చెబుతానన్నారు; మరచిపోయారా?!''

'మరచిపోలేదండీ! నిజానికి ఈ ఆలయాన్ని పన్నెండవ శతాబ్దంలో రాజా అనంతవర్మ చోడ గంగదేవ్ అన్న రాజు నిర్మించాడు. అప్పట్లో ఇది దేశంలోకల్లా ఎత్తైన దేవాలయం. దీని ఎత్తు చెబితే మీరు ఆశ్చర్యపోతారు. రెండువందల పద్నాలుగు అడుగులు. ఆ ఆలయ శిఖరాన్ని ఒక్కసారి చూడండి'' అంటూ నాకు సంజ్ఞ చేసింది. నేను ఆ శిఖరాన్ని చూడసాగాను.

''ఆ పెద్దపెద్ద రాళ్ళను ఆ శిఖరంపై అమర్చడానికి కొన్ని వేల టన్నుల మట్టిని, కూలీలను ఉపయోగించారు. ఇది నిజంగా ఒక గొప్ప రాతి కట్టడం''

ఆమె చెబుతుంటే ఆమె నిశిత పరిశీలనకు నాకు ఆశ్చర్యం కలగసాగింది.

''ఇంకో ముఖ్యవిషయం ఇక్కడ దేవాలయంలోని

## మూన

నాటిన వరిమూన
పిలకలేసి దుబ్బుకట్టి
నేవళంగా ఎదిగేక
ఏర్పడ్డ అంకురం
నెల్లాళ్ళకి సాగి
పిగిలి పొట్ట కొచ్చేక
విచ్చుకుంటాయి
శ్వేతవర్ణపు కంకులు!
అవి మరోమాసానికి
పాలు పోసుకుని
ఎర్రముక్కుతో
గట్టిపడ్డ కంకులు
బరువుతో తలవంచి
కోతనాహ్వానిస్తాయి!

## నగలు

పంట ముకానికొచ్చిన
వరి పొలంలో
పండిన వెన్నులు
కోతకోసిన పనులు
వేసిన వరికుప్పలు
నూర్చిన ధాన్యం రాసులు
భూదేవి నగలు!

## బహుమతి

ఎన్నెన్నో రకరకాలైన
పురుగుమందులు
చల్లినా చావని
క్రిమికీటకాదులు
ఒక్క గాలిమార్పుకి
అదే
తూర్పు పైరు గాలులికి
మటుమాయం
ఇది ప్రకృతి ఇచ్చిన
బహుమతి వైద్యం!

**మాధవరపు కృష్ణ**

వంటశాల దేశంలో మరే ఆలయంలోను లేనంత పెద్దది. కానీ అక్కడ ప్రసాదాలను మాత్రం మట్టికుండల్లోనే వండుతారు'' అంటూ చాలా వివరాలను చెప్పింది. ఆమె చెప్పిన వివరాలను విన్న తరువాత ఆలయాన్ని చూస్తుంటే మరింత అందగా కనిపించసాగింది.

ఆ తరువాత అక్కడికి దగ్గర్లోని 'ధవళగిరి' వెళ్ళాం. అక్కడే అశోకుడు కళింగరాజుతో యుద్ధం చేశాడు. అప్పుడే కొన్నివేలమంది కళింగసైనికులు మరణించారు. దాన్ని ఆ ప్రాంతంలో 'ధౌళీ' అంటారని చెప్పింది. అక్కడ అశోకుడి కాలంనాటి శిలాశాసనాలు పాళీ భాషలో రాసి వున్నాయి. వాటిని చూసి నేను ఒక విధమైన విస్మయానికి గురయ్యాను. నిజంగా నీహారికగానీ పరియం కాకపోతే ఇన్ని చారిత్రక ప్రదేశాలను చూసే అదృష్టం నాకు కలిగివుండేది కాదనిపించింది.

ఆ తరువాత వారంరోజులపాటు ఆ చుట్టుప్రక్కల ఎన్నో ప్రదేశాలు తిరిగాం. ముఖ్యంగా భువనేశ్వర్‌లోని కోణార్క్ సూర్యదేవాలయం, లింగరాజ్ టెంపుల్ ఈ రెండూ నన్ను ఆకట్టుకున్నాయి. నీహారికలో ఈ వారం రోజుల్నించి నేను గమనిస్తున్నదేమిటంటే ఆమె ఎక్కువగా ఒంటరితనాన్ని కోరుకుంటుంది. ఆమె కళ్లు ఎప్పుడూ వేటినో అన్వేషిస్తున్నట్లుంటాయి.

ఆ రాత్రి అమ్మ నాకు ఫోనుచేసి ఎల్లుండే నా పుట్టిన రోజునీ వెంటనే బయలుదేరిరమ్మని చెప్పడంతో ఆ మర్నాడు బయలుదేరాలని నిశ్చయించుకున్నాను. ఆ మర్నాడు నన్ను ట్రైన్ ఎక్కించేందుకు ఆమె రైల్వేస్టేషన్ కొచ్చింది. ఇంక అరగంటలో రైలు బయలుదేరుతుంది.

దగ్గర్లోని క్యాంటీన్‌లో వాటర్ బాటిల్ కొనేందుకు ట్రెయిన్ దిగాను. ఇంతలో ఆమే ఆ బాటిల్‌ని కొని నాకిచ్చింది.

ఆమెవైపు కృతజ్ఞతతో చూస్తూ ''నీహారికగారూ! ఇక్కడికొచ్చే ముందు చాలా నిరాశలో కూరుకుపోయి వుండేవాణ్ణి. కానీ ఈ వారం రోజుల్లో నాలో చాలా మార్పొచ్చింది. ఇప్పుడు నాలో ఆత్మవిశ్వాసం పొంగిపొర్లుతోంది. దీనికి కారణం మీరే. మీ పరిచయాన్ని నేను ఎప్పటికీ మరచిపోలేను'' అన్నాను.

## నానీలు

స్వజాతి సృష్టికి
కర్తవే ఐనా-
సూర్యుడివి కావు!
ఆరిపోయే దీపం నీవు!!

మానవీయుడవు
మహనీయుడవైనా
మట్టిలో కలిసే
వింత రూపం నీవు!

ప్రణయ పరిమలం
అందించే ప్రేమికుడవే
ఐనా నేల రాలే
పుష్పం నీవు!

సముద్రాన్నీదే
గజ ఈతగాడివే
ఐనా నీటమునిగే
మట్టిబొమ్మ నీవు!

విశ్వాన్ని ఛేదించే
విజ్ఞానివైనా-
శూన్యంలో కలిసిపోయే
మాయామర్మం నీవు!

కొడవలి సత్యనారాయణ

ఇంతలో రైలు కూతపెట్టి బయలుదేరింది. ఆమె ప్లాట్‌ఫాంమీద నిలబడి కనుమరుగయ్యేంతవరకు చేయి ఊపుతూనే ఉంది.

❖ ❖ ❖

విశాఖపట్నం వచ్చి వారంరోజులైనా నాకు నీహారిక ఆలోచనలే. ఏ పనిచేస్తున్నా ఆమే గుర్తుకు వచ్చేది. ప్రతి క్షణం నా మనసు ఆమె సాంగత్యాన్ని కోరుకున్నట్లనిపించింది. నిజంగా నీహారిక ఓ స్నేహశీలి! అమృత మూర్తి... ఆమెతో జీవితం పంచుకోవాలనిపించసాగింది నాకు. ఆరోజే నా మనసులోని మాటను ఆమెకు చెప్పాలని ఉత్తరం రాసాను.

ప్రియమైన నీహారిక గారికి,

కృష్ణ వ్రాయునది. ఆరోజు మీ దగ్గరనుండి ఇక్కడికొచ్చేశాక నాలో మళ్ళీ నైరాశ్యంచోటు చేసుకుంది. నిజంగా నిరాశలో కొట్టుకుపోతున్న నాకు కొండంత ధైర్యాన్నిచ్చారు మీరు. అందుకని ఈ స్నేహాన్ని జీవితాంతం మీతో కొనసాగించాలనిపిస్తోంది.

మీరనుమతిస్తే ఇద్దరం జంటగా జీవన పరిమళాన్ని ఆస్వాదిద్దాం. వివాహబంధంతో ఒకటవుదాం. అందుకు మీరు సమ్మతి తెలుపుతారని ఆశిస్తూ....

మీ
కృష్ణ

ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేసినతరువాత నా మనసు ప్రశాంతంగా ఉంది. అప్పట్నుంచీ రోజుల్ని గంటలు, నిముషాలతో లెక్కిస్తూ ఆమె ఉత్తరం కోసం చకోర పక్షిలా ఎదురు చూడసాగాను. అలా వారం రోజుల తరువాత నా నిరీక్షణ ఫలించి ఆమె నుండి ఉత్తరం వచ్చింది. వణుకుతున్న చేతులతో దాన్ని చదవడం మొదలుపెట్టాను.

కృష్ణ గారికి

నీహారిక వ్రాయునది. మీ ఉత్తరం చదివి నేను చాలా విస్మయానికి గురయ్యాను.

మీరు ఆరోజు నాకు పరిచయం అయినప్పుడు మీలో నిరాశని గమనించాను. అందుకే ఆ నిర్లిప్తతని తొలగించి మీలో మళ్ళీ జీవితంపట్ల ఆశని కల్పించాలనే ఆ వారం రోజులూ ప్రయత్నించాను. స్నేహంగా మెలిగాను. దాన్ని బహుశా మీరు తప్పుగా అర్థం చేసుకున్నట్లున్నారు.

ఇక అసలు విషయానికొస్తే నా గురించి కొన్ని నిజాలు మీకు చెప్పాలి! మాది విజయనగరం దగ్గర ఒక పల్లె. చిన్నప్పుడే మా అమ్మా నాన్నలు చనిపోతే మేనమామ ఇంట్లో పెరిగాను. డిగ్రీ పూర్తయిన తరువాత ఢిల్లీలోని జె.ఎన్.యూలో పిజిలో జాయినయ్యాను. అక్కడ

చదవడం చాలామంది ఒక అదృష్టంగా భావిస్తారు. అక్కడే నాకు 'వశిష్ట' పరిచయమయ్యాడు. మొదట్లో మేమిద్దరం స్నేహితులమవడానికి కారణం తెలుగు వాళ్ళమైతే అది కొనసాగడానికి కారణం మాత్రం ఇద్దరికీ ఇష్టమైన చిత్రలేఖనం.

నాకు చిన్నప్పట్నుండీ చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఆ సంవత్సరం యూనివర్సిటీ వారు నిర్వహించిన పోటీలో నేను గీసిన 'అభిసారిక' చిత్రానికి ప్రథమ బహుమతి వస్తే, వశిష్ట వేసిన 'మరీచిక'కి ద్వితీయ బహుమతి వచ్చింది.

అలా మొదలైన మా స్నేహం చదువు పూర్తయ్యేసరికి ప్రేమగా పరిణామం చెందింది. ఇద్దరం ఒకరినొకరు విడిచి ఉండలేని స్థితి. జెఎన్‌యూలో పిజి పూర్తవగానే వశిష్టకు న్యూయార్క్ యూనివర్సిటీలో ఎమ్.బి.ఏ సీటు రావడంతో ఏంచెయ్యాలో మా ఇద్దరికీ పాలుపోలేదు. మొదట్లో ఇద్దరం పెళ్ళి చేసుకొని తరువాత కలిసి వెళ్ళిపోవాలన్న అతని ప్రతిపాదనకి నేను ఒప్పుకోలేదు. పెళ్ళైతే చదువుమీద ధ్యాస ఉండదనీ, అది పూర్తయితే మన కాళ్ళమీద మనం నిలబడగలమనీ అతనికి చెప్పి అతన్ని ఒంటరిగా అమెరికా పంపించాను.

అతను ఆ చదువు పూర్తయి ఇండియాకొచ్చేసరికి రెండేళ్ళు పడుతుంది కాబట్టి ఆ రెండేళ్ళలో చిత్రలేఖనంలో డిప్లొమా కోర్సు చేద్దామని నేను శాంతినికేతన్ వెళ్ళి అక్కడ జాయినయ్యాను.

అక్కడ నా జీవితం చాలా ప్రశాంతంగా, హాయిగా గడవసాగింది. అందమైన ప్రకృతి మధ్య చిత్రలేఖనం నేర్చుకోవడం నిజంగా ఒక వరంలా భావించేదాన్ని.

ఏపుగా పెరిగిన అశోక వృక్షాలమధ్య రోజూ కాన్వాస్ మీద గంటలకు గంటలు చిత్రాలు గీయడం, రూమ్‌కి రాగానే మృదుమధురమైన సంగీతాన్ని వింటూ వశిష్టకి ఉత్తరాలు వ్రాయడం... రోజూ ఇవే నా వ్యాపకాలు. ఆవిధంగా ఆనందంగా రోజులు గడిచిపోతుండేవి. ఎప్పుడు ఈ రెండేళ్ళు గడుస్తాయో, ఎప్పుడు వశిష్ట వస్తాడోనని వేయికళ్ళతో ఎదురుచూస్తున్న నాకు జీవితంలో పెద్ద ఎదురుదెబ్బ క్యాన్సర్ రూపంలో తగిలింది.

మొదట్లో విపరీతంగా ఆయాసం వస్తుంటే వాతావరణ మార్పువల్ల అనుకొని నిర్లక్ష్యం చేసాను. కానీ అది రాను రాను తీవ్రమవడంతో డాక్టరుకి చూపిస్తే పరీక్షలన్నీ చేసి దాన్ని 'లంగ్ క్యాన్సర్' అని తేల్చారు. నాకు తెలిసేసరికి అది అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉందని, సంవత్సరంకన్నా ఎక్కువకాలం బ్రతకడం కష్టం అని వాళ్ళు చెప్పారు.

## అన్వేషణ

నేను అనే అహం మరచి
నీవు అనే పరం విడచి
మనం అనే తరంవైపు
పయనిద్దాం రా!

నిన్నవి గతంలో
నేటి వర్తమానంలో
రేపటి భవితవ్యానికి పనికివచ్చే
మంచి అనే పదార్థాన్ని వెతికి
పట్టుకుందాంరా!

పాతమతాల చింతకాయ పచ్చడిలో
కొత్త ఇజాల ఆవకాయ వరుగుల్లో
రుచులు మరిగి-జిహ్వా చాపల్యం
ఉచ్చుల్లో చిక్కుకున్న
రోగిష్టి తమ్ముల్లను ఆదుకొనే
ఔషధాలను అన్వేషిద్దాం రా!

## కాలం

కాలమన్నది కడలిలాంటిది
కదలుతరగలు వసంతాలు
ఎన్ని ఏడులు వచ్చిపోయిన
ఎవరి ప్రాప్తము వారికే!

## స్నేహం

స్నేహమన్నది దొడ్డ వృక్షము
శాఖలెన్నో దానికి
ఎందరెందరు మిత్రులున్నా
ఎవరి స్థానము వారికే!

బి.జనార్ధనరావు

ఈ విషయాన్ని వశిష్టకు తెలియబరచాలనీ మొదట్లో అనుకున్నాను. కానీ తెలిస్తే అతను చదువు మానేసి ఇక్కడకు వచ్చేస్తాడు. దానివల్ల ఏం లాభం? మృత్యువు ముంగిట్లో ఉన్న నాకు అతని రాక ఏవిధంగానూ ఆయువును పోయదని తెలుసు. పైగా నేను చనిపోయిన తరువాత దుఃఖంలో కూరుకుపోతాడని తెలుసు.

వశిష్ట మనసు నాకు తెలుసు. అతడిది చిన్నపిల్లాడి మనస్తత్వం. కష్టాలను ఓర్చుకోలేడు చిగురుటాకులా వణికిపోతాడు. నాతో చేసిన స్నేహంవల్ల అతని జీవితం నాశనం కాకూడదనిపించింది.

ఎలాగూ నేను గాలిలో రెపరెపలాడే దీపాన్ని. ఇవాళ కాకపోతే రేపైనా ఆరిపోవాల్సిందే. అందుకే ఆరిపోయే దాకా వెలుగునిస్తే అదో తృప్తి! చీకటిని పారద్రోలానన్న తృప్తైనా మిగులుతుంది. ఆ తృప్తితో హాయిగా కళ్ళు మూయవచ్చు. ప్రతి మనిషి జీవితంలో మరణం అనేది అనివార్యం. దాని గురించి పెద్దగా బాధపడకూడదనుకున్నాను.

అందుకే ఈ విషయం ఎవరికీ చివరికి వశిష్టకు కూడా చెప్పకుండా పూరీ వెళ్ళిపోయాను. నా చివరి రోజులను ఆ జగన్నాథుడి సన్నిధిలో ఆ స్వామికి సేవ చేస్తూ గడిపెయ్యాలని నిర్ణయించుకున్నాను. వశిష్ట సెలవులకు రెండుసార్లు నా దగ్గరకొస్తానంటే నేనే వద్దనీ, ఎలాగూ సంవత్సరం తరువాత చదువు పూర్తయిన వెంటనే వస్తేమంచిదనీ వ్రాసి ఒప్పించాను.

అతను వచ్చిన తరువాత జీవితాన్ని ఆనందంగా ఎలా గడపాచ్చో తెలియపరుస్తూ ప్రతివారం అతనికి ఉత్తరం రాసేదాన్ని. అది అతని ఒంటరితనాన్ని పోగొట్టి సంవత్సరం దాకా ఇక్కడకు రాకుండా ఉండటానికి ఒక టానిక్కులా ఉపయోగపడుతుందని నా నమ్మకం!

అలా చెయ్యడం నైతికంగా తప్పని తెలిసినా, అతని జీవనదీపం నిరంతరం హాయిగా ప్రజ్వలించాలంటే అలా చేయకతప్పదు. నేను ఒడిగట్టుకుపోతున్న దీపాన్నైతే అతను పదిమందికి వెలుగులు విరజిమ్మబోయే అఖండ దీపం. దాన్ని ఆరిపోకుండా నా రెండు చేతులతో కాపాడాలి.

ఎక్కడ నా విషయం తెలిసి అతను చదువు మధ్యలో వదిలేసి ఇక్కడకు వచ్చేస్తాడోనని నాలో నిరంతర సంఘర్షణ. అందుకే ఆ మరణాన్ని నాకు త్వరగా ప్రసాదించమనీ ఆ జగన్నాథుణ్ణి రోజూ వేడుకుంటూ ఉండేదాన్ని. అతను వచ్చే లోపల ఈ దీపం ఆరిపోవాలి! ఇలా రోజులు, క్షణాలు లెక్కపెడుతూ గడుపుతున్న నాకు నిరాశలో మునిగివున్న మీరు పరిచయం అయ్యారు. మీలో ఉన్న ఆ నిరాశని పారద్రోలి, ధైర్యం కల్పించాలనే ఉన్న వారం రోజులూ విశ్వప్రయత్నం చేశాను. కానీ దానివల్ల మీరు నామీద ఆరాధన పెంచుకుంటారని నేనూహించలేదు.

కృష్ణ గారూ! నిరాశ అన్నది ఒక అలలాంటిది. దాన్నుంచి ఒడుపుగా తప్పుకోవాలే గాని లేకపోతే అది మనల్ని తనతో తీసుకెళ్ళిపోతుంది. మీరు ఒక ఇంజనీరు. మీ సేవలుసమాజానికే కాదు, మీ తల్లిదండ్రులకూ కావాలి. అటువంటి మీరు ఈ తాత్కాలిక ఆకర్షణలు, ప్రేమలపైమనసుపెట్టక జీవితాన్ని పదిమందికి ఉపయోగపడేటట్లు తీర్చిదిద్దుకోండి. కొడిగట్టుకుపోయే ముందు ఈ దీపం కోరిన కోరికను మన్నిస్తారని ఆశిస్తున్నాను.

చివరగా నేనొక సైకత శిల్పాన్ని. దాన్ని ఇసుకతో తీర్చిదిద్దుతున్నప్పుడు చాలా అందంగా కళ ఉట్టిపడుతున్నట్లు కనిపిస్తుంది. కానీ ఏ సుడిగాలి వీచినా, వర్షం వచ్చినా అది నాశనం అయిపోతుంది. నాలాగే... అందుకనీ నా గురించి ఆశపడకండి. ఆఖరిగా నాదో చిన్న కోరిక. నా జీవితాన్ని తల్చుకొని ఎప్పుడూ జాలిపడొద్దు. అది నాకు తీవ్రమైన వేదన మిగులుస్తుంది. ఎప్పుడో తిలక్ చెప్పినట్లు

"నేను వెళ్ళొస్తాను, చీకటి పడుతోంది.
చిటారు కొమ్మలో నక్షత్రం చిక్కుకుంది.
శిథిల సంధ్యా గగనం రుధిరాన్ని కక్కుతుంది
దారంతా గోతులు, ధైర్యమే ఒక కవచం"
నేను వెళ్ళిపోయే రోజుకోసం ఎదురుచూస్తూ
'నీహారిక'

ఆ ఉత్తరాన్ని చదివిన నాకు ఆమె రూపం కళ్ళముందు మెదలసాగింది. నాకు తెలియకుండానే నా కళ్ళనుండి రెండు కన్నీటిబొట్లు రాలిపడ్డాయి. ■

## కల్లలు

అవన్నీ

బంగారు కలలే!

బంగారం వాడిది

కలలు నావి!!

నేహా